# ప్రతీకారం

పదేళ్ళనుంచీ పుల్లయ్యా, నల్లయ్యా వడ్ల వ్యాపారంలో భాగస్థులుగా వుంటూ మంచి లాభాలు సంపాయించి, చెరో ఆరెకరాలభూమీ కొనుక్కున్నారు; చెరో డాబా పక్కపక్కనే కట్టుకొన్నారు. రెండు ఇళ్ళల్లోవున్నా ఏక కుటుంబాలల్లే వారి కుటుంబాలు కలిసిపోయినవి. వ్యాపారంలో అభిప్రాయభేదాలు రాకుండేందుకు ఇదీ ఒక కారణమే!

మరికొన్ని ఇతర వ్యాపారాలుకూడా చేశారు కాని అవి అంతగా కలిసి రాలేదు. వాళ్ళిప్పుడు కొత్తగా ఇటుక రాళ్లు తయారింపు చేయించాలని నిశ్చయించుకున్నారు. ఆవూరికి వీళ్ళదే మొదటి ఆఁవ అవుతుంది. పలుకుబడితో అమ్మితే మంచిలాభాలు ఉంటవి. ఊరిని అనుకొనే బకింగ్‌హామ్ కాలువ ప్రవహిస్తోంది. ఎండాకాలంలోకూడా నీళ్లుంటవి. కాలవ కట్ట మీదనే పుల్లయ్య చావిడివుంది. ఒండ్రుమట్టి కట్టుకు పోయినంత దొరుకుతుంది. ఆఁవ పేర్చేందుకు బోలెడు చోటు. అంతా సుముఖంగానే వుంది.

మర్నాటి సాయింత్రానికి ఒక ముఠావాళ్లు దిగారు. వీళ్ళల్లో పన్నెండుమంది మొగాళ్లూ, ఎనిమిదిమంది ఆడవాళ్లూను. ఇంకా ముసలివాళ్ళూ, పిల్లలూ ఉన్నారు కాని, వాళ్లు మనుషుల్లో లెక్కకాదు. మర్నాడు కాలవ కట్టనే తాటాకు పాకాలు వేసుకొని, ఆతరువాతిరోజు

పని ప్రారంభం చేసేందుకు ఏర్పాట్లు చేయబడినవి. ముఠానాయకుడు కొండయ్యకు పుల్లయ్య కొంతడబ్బు ఎడ్వాన్సుగాకూడా ఇచ్చాడు.

★

పుల్లయ్య భోజనంచేసి, ఉత్తరాది కారు పుగాకుచుట్ట ముల్లు గర్ర లావునచుట్టి, రైలు ఇంజన్‌లా పొగ వొదులుతో గంభీరంగా చావడి దగ్గరకు వచ్చాడు. పుల్లయ్యది నిండైన విగ్రహం. ముఖాని కంతటికీ-ముఖ్యంగా ఆయన బొర్రమీసాలు ఎంతో గంభీరాన్ని తెచ్చిపెడతాయి. వయస్సు ముప్పై అయిదేళ్లు దాటినప్పటికీ ఆయన శరీరపు ఎత్తూ, లావులు-ఆ వయస్సును మరుగు పరుస్తాయి. భగవంతుడు ప్రత్యేకంగా ఒక వరం ప్రసాదించాడా అన్నట్టు-ఆయన ముఖం అహర్నిశలూ నవ్వుతూనే ఉంటుంది. ఆ సహజమైన నవ్వు తాలూకు కిటుకు ఏమంటే-స్త్రీ హృదయంలో గోముగా గిలిగింతలు పెడుతుంది; అజ్ఞాతంగా వున్న సిగ్గును బయటకు లాగుతుంది; అవ్యక్తమైన మోహాన్ని ఆవరింప జేస్తుంది; ఏదో ఇంద్రజాలానికి తాము గురి అవుతూన్నట్టు భావన కలిగిస్తుంది. ఈ ప్రత్యేక ప్రభావం ఆయన నవ్వుకు ఉండటం చాతనే నేమో చాలమంది స్త్రీలు ఆయనతోడి అనుభవాన్ని వాంఛించారు. పుల్లయ్య స్త్రీలోలుడనీ, ఆయన చిరునవ్వులోని మాయకు కొంతమంది ఆడవాళ్ళు యాంత్రికంగా లొంగిపోతారనీ అనుకుంటూ వుంటారు. అందులో కొంతైనా నిజం లేకపోలేదు.

కూలీలు మట్టి కలుపు తున్నారు. ఆడవాళ్ళు కాలువలోంచి నీళ్లు తీసుకొని వస్తున్నారు. ఒడ్డున కూర్చుండిన నల్లయ్య 'ఊc! త్వరగా కానీయండి' అని త్వర పెడుతున్నాడు. పుల్లయ్య అక్కడకు వెళ్లి నిలబడ్డాడు.

'భోజనం అయిందా!' అన్నాడు నల్లయ్య.

'ఊc!' నీళ్లు తెచ్చే ఆడవాళ్ల కేసి చూస్తున్నాడు పుల్లయ్య.

'అయితే నేను ఇంటికెళ్ళి వస్తాను' అని లేచాడు నల్లయ్య.

పుల్లయ్య చూపులు ఇంకా ఇటు పనివాళ్ళ మీదకు మళ్ళలేదు. కాలువ ఒడ్డుమీద నిలబడింది ఆమె. పండు మిరప రంగు చీర మోకాళ్ళపైకి ఎగకట్టింది. తెల్లటి రవికె వేసుకుంది. అంత దూరంలోనే ఆమె ఆకర్షించగలిగింది పుల్లయ్యను.

పుల్లయ్య పిల్లిలాగ మెల్లిగా నడిచి వెళ్ళాడు అటుకేసి. దగ్గరనుంచి ఆమెను చూడాలనే వాంఛ పుల్లయ్యలో చాలా వేగంగానూ, బలంగానూ కలిగింది. అందుచేతే అక్కడ చేస్తూన్న పని వంక క్రీగంటిగా నైనా చూడకుండా కాలువ ఒడ్డుకు వెళ్లాడు.

ఆమె పక్కనే వెళ్లి నిలబడ్డాడు పుల్లయ్య. ఆమెలో ఏమీ చలనం కలగలేదు. చూసీ చూడనట్టు కిందనుంచి కడవల జత అందుకుంటూనే ఉంది. ఆ వొంగినప్పుడు జారిన పైటలోంచి ముందుకు తొంగిచూసే ఆ రొమ్ముల నవనవనీ, కదలికనూ, ఆసక్తిగా చూడ నారంభించాడు. సహజమైన చిరునవ్వును పెదాలమీదకు రప్పించి-ఆ చిరునవ్వును ఆమె చూడాలని ఆరాట పడ్డాడు. కాని ఆమెకు పుల్లయ్య వంక తీరిగ్గా చూసే పాటి తీరిక లేదు. ఆమెకు ముందున్న ఆవిడ త్వరగా కడవలు అందిస్తూన్నది. పుల్లయ్యలో క్రమేపీ ఉద్రేకం ప్రవిస్తూన్నది.

ఎండకు ఆమె ముఖంమీద, చెమట బిందువులుగా ఏర్పడింది. పైట చెంగు రవికెకింద బిగుతుగా దోపింది. మెడలోని గొలుసు ఎండకు మెరుస్తోంది. పుల్లయ్య తుపుక్కున వూసి, చుట్ట కాలవలోకి విసిరి పార వేశాడు. ఆమెను పలకరిద్దామను కున్నాడు కాని తీరా నోరు విప్పబోయే సరికి మేస్త్రీ కొండయ్య అక్కడకు వచ్చాడు.

'ఇక్కడ నిలబడ్డారేమండీ ?'

'ఏం లేదు! నీళ్ళు సరిగ్గా అందుతున్నాయా?' పుల్లయ్య ఏం తొణక లేదు. కాని ఆమెవంక చూడటం మానివేశాడు.

'అందుతున్నాయండి.'

కొండయ్య మోకాళ్ళనిండా బురద ఉంది. ఆ బురదను కాలువలో కడిగేసుకున్నాడు. మట్టికలిపేవాడు ఇక్కడికి ఎందుకు రావాల్సి వొచ్చింది?-అనుకున్నాడు పుల్లయ్య. వాడు మరి మేస్త్రీ కావడంచాత వాణ్ని ఆ ప్రశ్న వేయలేదు. కొండయ్య కాలువగట్టుమీదకు వొచ్చాడు.

'అక్కడకు వెళదాం రాండి!' అంటూ పుల్లయ్యను మట్టికలిపే దగ్గరకు తీసుకు వెళ్ళాడు కొండయ్య. తను కాలువ ఒడ్డున ఆమె పక్కన నిలబడితే కొండయ్యకు ఎందుకు ముల్లు గుచ్చుకున్నట్టు వుండాలి? అని

ప్రశ్నించుకున్న మీదట, పుల్లయ్యకు తట్టిన ఊహ ఏమిటంటే; ఆమె వాడి భార్య అయివుంటుందని.

పుల్లయ్య ఊహించింది అక్షరాలా నిజం. ఆమె కొండయ్య భార్యే! వాడికి పెళ్ళాంమీద ఎంత ప్రేమో—ఆమె అందంమీద అంత అసూయ. అసలు భార్యలో ఆ అందం ఉండబట్టి తను ఆవిధంగా ప్రేమించ గలుగుతున్నాడనేది కొండయ్య ఎప్పుడూ ఆలోచించ లేదు. లోకంలో తను భార్యల అందానికి పొంగిపోయే వాళ్ళూ, విర్రవీగేవాళ్ళూ, గర్వపడే వాళ్లూ ఉన్నారు; కాని వాళ్ళంతా పరోక్షంగా తమ ఆత్మల్లో అసూయనీ, ద్వేషాన్నీ పెంచుకొన్న వాళ్లే! తమ భార్యల సౌందర్యాన్నిచూసి పరాయి పురుషులు లొట్టలు వేస్తున్నారని యమబాధ పడుతూన్న వాళ్ళే! స్త్రీ అందంమీద మగవాడు హక్కును పొందాలనీ, ఆ అందానికి ఒక పరిమితిని ఏర్పరచాలనీ,—ఆరాట పడతాడు గానీ, ఆ అందం మహత్తర మైనదనీ, ఆ అందంమీద అధికారాన్ని పొందాలనుకోవటం అవివేకం తప్ప మరొకటి కాదనీ తెలుసుకోలేడు. పుల్లయ్య తనభార్య పక్కన నిలుచోవటం చూసిన క్షణంనుంచీ కొండయ్య దృష్టి పనిమీదికి పోలేదు. తన ఆస్తిని ఎవరో దోచుకుంటూన్నట్టు, తన బంగారాన్ని ఎవరో అపహరించ బోతూన్నట్టు, తను పెంచిన పువ్వును ఎవరో తుంపుతూన్నట్టు-హృదయం నిర్విరామంగా అలజడి పడి, పనిమీద మనస్సును పోనివ్వలేదు. వెంటనే అక్కడికొచ్చాడు. భార్యపక్క యజమాని నిలబడితే వొళ్ళంతా పురుగులు పాకినట్టు అయింది. ఏదో మిషమీద ఇవతలకు తీసుకు వచ్చాడు.

కొండయ్య రెండురెళ్ళు నాలుగు మనిషి. నిండుగా పాతికయేళ్ళు రాకముందే ముఠాకు నాయకుడైనాడు. కండలు బలిసిన అతని శరీర సౌష్ఠవమూ, శరీరానికి తక్కువగా అగపడే ఆ ముఖంలోని అమాయకత్వమూ, ఉంగరాలు తిరిగిన జుత్తూ-అచ్చు జానపద చిత్రాల్లో హీరోలాగావుంటాడు. అవినీతిని సహించడు; అవినీతికి పాల్పడడు; అక్రమానికి తలపడడు; ఖండిస్తాడు; న్యాయబుద్ధి గలవాడు; తనకు చెడుచేసిన వాళ్లకు మంచిచేసేపాటి ఉదాత్తమైన హృదయం అతనిది కాదుగానీ-కనీసం చెడు చేయకుండా ఉండాలనే పాటి సామాన్య హృదయం కూడా కాదు. ప్రతీకారాన్ని తీర్చుకోవాలనే పట్టుదల గలవాడు.

పుల్లయ్య మట్టి అడుసు దగ్గరే కూర్చున్నాడు. కాని చూపులు తరుమా కాలవ కట్టమీది కొండయ్య భార్యమీదనే ఉన్నాయి.

★

'నీ పేరేమిటి?'

'వ్యాపారమ్మ!'

'వ్యాపారమ్మా! చాల గమ్మత్తుగా ఉండే పేరు!' నవ్వాడు పుల్లయ్య. కొండయ్య భార్య వ్యాపారమ్మ ఆయనకేసి చూసింది. పుల్లయ్య పెదాలు కదల్చకుండా మనోహరంగా నవ్వాడు. ఆమె ఆ నవ్వులోని ఆకర్షణను భరించ లేక పోయింది. వాలిపోతూన్న పూలతీగలాగా ఆమె చూపులు దించుకున్నాయి.

గడ్డివాముల సందుల్లోంచి సూర్యుడు అస్తమిస్తున్నాడు. గాలికి తాటిచెట్ల ఆకులు చేసే గోల అంతా ఇంతా కాదు. గేదెకు జనప కట్టె కోసం అక్కడికి వచ్చింది వ్యాపారమ్మ. జీతగాడ్ని పొగాకు కోసం ఊళ్లోకి పంపి, ఏకాంతంగా ఉన్న ప్రదేశానికి, గడ్డివాములూ తాటి చెట్లూ, యీతచెట్లూ, చిట్టికేసరి చెట్లూ, పిచ్చి మొక్కలూ ఉన్న ఆ ప్రదేశానికి—పుల్లయ్య దొంగ తనం చేయటానికి వొస్తూన్న వాడిలాగ, అడుగులో అడుగు వేసుకొంటూ వొచ్చి ఆమెను పలకరించాడు.

పది రోజులుగా వ్యాపారమ్మ ఆయన ప్రవర్తనను కనిపెడుతూనే ఉంది. వస్తుతః భర్తవల్ల భయంవల్ల నైతేనేమి, అవకాశం లభించని కారణానైతేనేమి, ఎన్నడూ అటువంటి నీతిమాలిన పనులు చేయక పోయినప్పటికీ-అందమైన పరాయి పురుషుణ్ని చూడగానే హృదయంలో ఏదో ఉద్రేకమూ, ఆవేశమూ, ఆనందమూ ఒక్కుమ్మడిగా కలిగి, మనిషిని తలక్రిందులు చేస్తూ, అప్పుడప్పుడూ 'ఏం సాహసిస్తే?' అన్న ధైర్యాన్ని కూడా ప్రసాదించటంతో-భర్తకూ, సంఘానికీ, భయపడి, ఉద్రేకపూరితమైన కోర్కెలను అణచుకుంటూ బతుకుతూన్న బానిసబ్రతుకులో, ఆయన నవ్వు, ఆయన చూపులు, ఆయన శరీర సౌష్ఠవమూ ఏవో మరుగుపడిన కోర్కెలను, నీరసించిన ఉద్రేకాలను, అసంభవం అనుకొన్న అనుభవాలను—పునః సృష్టి చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తోచిందామెకు. కాని

తను లొంగితే! తన శరీరం ఇంకొకడి అనుభవానికి ఆధారమైనట్టు తెలిస్తే —భర్త ఇంకా తనని బ్రతకనిస్తాడా? అమ్మో...ఆ తలపే పనికిరాదు!

క్షణక్షణం పుల్లయ్యలో ఉద్రేకం జాస్తి కాజొచ్చింది. ఆమె దగ్గరగా వెళ్ళాడు. ఆమెలో కూడా ఉద్రేకం కట్టలు తెంచుకుంది. ముఖమంతా ఎర్రబడింది. 'ఎందుకొచ్చావు?' అని పుల్లయ్య అనలేదు.

కాని ఆమె తను అక్కడికి, ఆ సమయాన వొచ్చిన పనిని తెలియజెయ్యాలని బాధపడుతూంది.

'గేదె... గేదె... మేత కావాలి!'

పుల్లయ్య నవ్వాడు. 'తరువాత తీసుకెళ్ళవచ్చులే' అన్నాడు అంతకు ముందు పని ముఖ్యమన్నట్టు. ఆమె చేయి పట్టుకున్నాడు. ఆమెలో భయం పొగలాగ రేగింది. బలంగా తగ్గరకు లాక్కొనేందుకు పుల్లయ్య త్వరపడ్డాడు. ఆమె మణికట్టుమీది గాజు పుటుక్కున పగిలింది. పుల్లయ్య ఆమె చేతిని వొదిలి పెట్టాడు. చావడివెనుక ఎవరో వొస్తూన్నట్టు అడుగుల చప్పుడు అయింది. పుల్లయ్య గబుక్కున చావట్లోకి జొరబడ్డాడు. వ్యాపారమ్మ ప్రాణంలేని గుడ్డ బొమ్మలాగ నిశ్చలంగా వామి ముందు నిలబడింది.

'మేత తీసుకెళ్ళవే!' అన్నాడు చావట్లోంచి పుల్లయ్య.

చావడి వెనుక నుంచి కొండయ్య వొచ్చాడు. పగిలిన అగ్నిపర్వతంలాగ భుగభుగ మంటున్నాడు. వామి ముందు తన భార్యనూ, చావట్లోని పుల్లయ్యనూ చూశాడు. వ్యాపారమ్మ స్తబ్ధుగా నిలబడి పోయింది.

'ఇక్కడెందుకున్నావే?' గర్జించాడు కొండయ్య.

'గేదె మేతకోసం వొచ్చిందోయ్. తీసుకెళ్ళమంటున్నాను' అన్నాడు పుల్లయ్య, చావడి మచ్చుమీద ఏదో సర్దుతూన్నట్టు నటిస్తూ.

కొండయ్య ఏం మాట్లాడలేదు. వ్యాపారమ్మలో ఇంకా చేతనాశక్తి సమకూడ లేదు.

కొండయ్య వామి ముందు వంగాడు మేత దూసేందుకు. కొంతసేపటికి ఆమె కూడా మేత దూయనారంభించింది. పుల్లయ్య చావట్లోంచి ముఖం చిట్లించుకొంటూ ఇటుకరాయి అచ్చులుతీసే దగ్గరకు

వెళ్ళాడు. అక్కడ నల్లయ్య—'ఇక ప్రొద్దు కూకిందిగానీ—ఇవాళిటికి పని ఆపుచేయండి' అన్నాడు.

'పానకంలో పుడకలాగ వొచ్చిపడ్డాడు' అని కొండయ్యను తిట్టుకుంటున్నాడు పుల్లయ్య.

★

రోజు రోజుకీ పుల్లయ్యలో వ్యాపారమ్మ మీది మోహం ఎక్కువ అవుతోంది. ఆయన ఉద్దేశ్యం ఆరునూరైనా సరే ఆమెను అనుభవించాలి. కాని అవకాశం దొరకడం లేదు. ఆ కూలిముఠాలో పుగాకు ఖర్చులు లంచంగా యిచ్చి ఒకణ్ని దగ్గరకు చేరదీసి వ్యాపారమ్మ ఎటువంటి మని షని అడిగాడు పుల్లయ్య. యజమాని మనస్సులోని శంకను వాడు పసి కట్టాడు.

'దొరా! అమె అయితే ఆ రకానికి చెందిందేఁగాని, దాని మొగుడు కొండడు చూస్తే నిలువునా పాతేస్తాడు.'

పుల్లయ్య భయపడినంతా అయింది. వాడి భీకర స్వరూపాన్ని చూసే వెనుకంజ వేయడం! లేక పొతే ఇటువంటి ఆడవాళ్లు తనకు ఒక లెక్కలోని వారా? తను సరిగ్గా కన్ను గీటితే వీళ్ళంతా అడుగు ముందుకు వేయగలరా? ఎట్లాగైనా అవకాశాన్ని కల్పించాలి. ఎట్లా? ఒక్క రాత్రిపూట కొండయ్యను ఊళ్లో లేకుండా చేస్తే-ఆ రాత్రి తన వాంఛను తీర్చుకో వొచ్చు. వ్యాపారమ్మలో మజా ఏమిటో సజావుగా అనుభవించ వొచ్చు. పుల్లయ్య ఆలోచించాడు. ఆలోచించితే ఉపాయం దొరక్క పోతుందా?

ఆ సాయంత్రం భాగస్థుడు నల్లయ్యతో సంప్రదించాడు పుల్లయ్య.

'ఇంకా మరికొంతమంది కూలీలను పిలిపిద్దామా ?'

'ఎందుకూ, వీళ్ళు చాలరూ?'

'అదికాదు వొచ్చేది సీజను. ఎందుకైనా మంచిది, మనం సాధ్యమైనంత ముందుగానే ఆఁవ కాల్చటం ముఖ్యం. సరుకు వేగం అమ్ముడు పోతుంది. అదీ కాక పక్క ఊళ్ళో ఇటుక తీసే ముఠాకు పని అయిపోయిందట. అందులో కొంతమందిని పిలిపిద్దాం,' అన్నాడు పుల్లయ్య.

'సరే' అన్నాడు నల్లయ్య.

కొండయ్యను పిలిపించారు.

'కొండయ్యా! మనకి ఇంకా కొంతమంది కూలివాళ్లు కావాలి. పాలెం వెళ్ళి వెంకటాయి ముఠాలోంచి పదిమందిని తీసుకురా. ఈ నెలాఖరికే ఇటుకరాయి అచ్చుపోయటం అయిపోవాలి. వొచ్చే నెల అయిదో తారీఖుకి ఇటుక ఆవ పేర్చటం జరగాలి.'

'ఎప్పుడు వెళ్ళి తీసుకు రమ్మంటారు?'

'ఇంకా ఎప్పుడోనా? ఈ రాత్రికే వెళ్ళి రేపు ఉదయం తీసుకురా. ఆలస్యం చేస్తే ఆముఠా మూటా ముల్లెసర్దుకొని వాళ్ళు ఇంకో వూరు వెళ్ళిపోవొచ్చు.'

ఈ రాత్రి వెళ్లి అక్కడ ఉండటమనగానే కొండయ్య సందేహించాడు. ఇబ్బందిగా చూశాడు.

'సందేహిస్తావేం కొండయ్యా-వెళ్ళిరా!' అన్నాడు నల్లయ్య.

ఇక కొండయ్యకు వెళ్ళక తప్పలేదు. గొణుక్కుంటూ వెళ్లాడు. పుల్లయ్య మీసం మీదకు అప్రయత్నంగా చెయ్యి పోయింది. అప్రయత్నంగానే పెదాలమీద చిరునవ్వు జనించింది. ఆ సమయంలో పుల్లయ్య ముఖంకేసి చూసిన నల్లయ్యకు భాగస్థుడి ముఖంలో కాకతాళీయంగా కలిగిన తేటదనానికి కారణం అగపడలేదు.

సూర్యుడు పూర్తిగా అస్తమించాడు. కూలీలు పని ఆపారు.

నల్లయ్య ఇంటికి వెళ్ళేందుకు సంసిద్ధుడైనాడు. పుల్లయ్య చావట్లోకి వెళ్ళాడు ఏదో పని ఉన్నట్టు. నల్లయ్య ఇంటికి వెళ్ళేందుకు బయలుదేరాడు పుల్లయ్య. ఆకూలి ముఠాలోంచి ఒకణ్ణి దగ్గరకు పిలిచాడు. వాళ్లు ఇద్దరూ వామిచాటుకు వెళ్లి అయిదునిమిషాలపాటు ఏదో రహస్యంమాట్లాడుకున్నారు.అట్లా వాళ్ళిద్దరూమాట్లాడుకోవటం ఒకళ్ళిద్దరు కూలీలు చూశారు.

ఆతృతతో కాగిపోయే శరీరంతో, తహతహతో దహించుకొనిపోయ్యే హృదయంతో, రాత్రి పదకొండింటికి, చప్పుడు కాకుండా తలుపుతీసి, వీధిలోకొచ్చాడు పుల్లయ్య. జాగ్రత్తగా ముందు వెనుకలు చూసుకుంటూ ఆ చీకట్లో చావడిదగ్గిరకి జేరాడు.

చావడిముందు ఇద్దరు నిలబడి ఉన్నట్టు గ్రహించాడు పుల్లయ్య.

ఆయన రావటంతోనే వ్యాపారమ్మ చావట్లోకి వెళ్ళింది. ఇంకోవ్యక్తి నవ్వుతూ చావడి వెనగ్గా వెళ్లాడు. పుల్లయ్య చావట్లోకి, చీకట్లోకి వెళ్లాడు.

★

పాలెంలోని కొండయ్యకు అర్ధరాత్రయినా నిద్ర పట్టలేదు. క్షణ క్షణానికీ అతని కళ్ళముందు భార్య, పుల్లయ్య తిరుగుతున్నారు.

పుల్లయ్య తనని ఈ రాత్రి ఇక్కడకు పంపడంలో ఏదైనా కిటుకూ, కుట్రా ఉందా? తను లేకపోవడంచూసి, తన భార్యతో... అంత అవినీతికి తలపడతాడా? ఏమో! తను మొదట్నుంచీ చూస్తున్నాడు-ఆయన పోకడలను. తన భార్యవంక చూడడం, మాట్లాడాలని తహ తహలాడటం తనకి అరికాలిమంట నెత్తి కెక్కించాయి. ఏంచేస్తాడు? యజమాని! ఆ బుద్ధీ, ఆ జ్ఞానమూ ఆయన కుండాలిగానీ—తను నోరు పారేసుకోవడం బాగుండదు!

ఇంతకూ పుల్లయ్య ఏ ఆలోచనా లేకుండానే తనని ఇక్కడకు పంపించాడా? ఏమో! ఏమిటా నమ్మకం? ఆ చావట్లోకి తన భార్యను రప్పించి, చీకట్లో—కటికి చీకట్లో కౌగలించుకొని, నగ్నంగా చేసి... ఆఁ! అంత అన్యాయమా? తను భర్త! మగవాడు—చూస్తూ ఊరుకోవడమా? తనలో పౌరుషం లేదూ?

కొండయ్య ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు.

తను ఇంటికివెళ్ళితే! రెండు మైళ్ళేగా! చీకటి. ఏం చీకటైతే? నదులూ, కొండలూ, పొదలూ, అడవులూ, సముద్రాలూ ఉన్నా దూకి తను ఈ అర్ధరాత్రి ఇంటికి వెళ్లవలసిందే! జరుగుతోన్న అవినీతిని అరికట్టాల్సిందే! తను ఊహించిందే నిజమైతే-వాళ్ళని ఆ చావట్లోనే, ఆ చీకటిలోనే గండ్రగొడ్డలితో నరికి వేయాల్సిందే!

కొండయ్య పైపంచ తలగుడ్డగా చుట్టుకొని, కర్ర చేత్తో పట్టుకొని బయలుదేరాడు. కాని ఆ ఆవేశంలో కొంతదూరం వొచ్చాక చప్పబడ్డాడు.

ఇదంతా తన అనుమానమేనేమో? ఏం జరగదు! తన భార్య పాతివ్రత్యం తనకు తెలియదూ? తను ఊరికనే అనుమానపడడం తప్పు—తన

భార్య చావట్లోకి వెళ్ళటానికి ఎన్ని గుండెలు! పుల్లయ్యకు మాత్రం అర్ధరాత్రి తన భార్యను చావట్లోకి రప్పించటానికి ఎన్ని గుండెలు! కొండయ్య వెనక్కు తిరిగాడు. లేచిన చోటనే వెళ్ళి పడుకున్నాడు. కాని నిద్రపట్ట లేదు.

★

మరునాడు ఉదయం పదిగంటలకు కొండయ్య పదిమంది కూలి వాళ్ళను వెంట బెట్టుకొని వచ్చాడు. ఆ రోజు పుల్లయ్య చావడి దగ్గరకు రాలేదు. ఏదో పనిఉండి ఇంటి దగ్గర్నే ఉండిపొయ్యాడు. నల్లయ్యే పని చేయిస్తూ ఉన్నాడు.

నిజం దాగదు. అందులోనూ 'అవినీతి'కి సంబంధించిన నిజం అసలే దాగదు. వ్యాపారమ్మను అర్ధరాత్రి పుల్లయ్య చావట్లోకి తీసుకొని వెళ్ళటం, ఆ కూలీ ముఠాలో ఒకడు చూశాడు. చూసినవాడు ఎందుకు ఊరుకుంటాడు? ఇటువంటి రహస్యాల్ని బయట పెట్టటంలో తాము సంఘానికి సేవ చేస్తున్నామని, అవినీతిని అరికడుతున్నామని తృప్తిపడే రకం ఎంతమంది లేరు?

కొండయ్యకు చెప్పే వరకూ వాడిప్రాణం ఒకచోట నిలవ లేదు. తను చెప్పటం చాత కొండయ్యలో కలిగిన కోపాన్ని వాడు చూడలేక పోయాడు.

కొండయ్య హృదయం కోపాగ్నిని భరించలేక బద్దలైంది. ఆ కోపాగ్నికి భార్య దహించుకొని పోయింది. జుట్టు పట్టుకొని తాటాకుల దడికేసి కొట్టాడు; డొక్కలో ఎగిరెగిరి తన్నాడు; ఎర్రగా వాతలు తేలేట్టు కొట్టాడు; బలంకొద్దీ వీపుమీద గుద్దాడు; అతనికోపం చల్లార లేదు. ఆమె నుంచి ఏడుపు రాలేదు. అన్ని దెబ్బలనూ భరించింది. అన్ని తిట్లనూ సహించింది. పెదాల్నుంచి నెత్తురు కారుతున్నా తుడుచుకో లేదు; రవికె చిరిగినా చూచుకో లేదు. కాని కళ్ళనుంచి నీళ్లు రాకపోయినా బాధ ఎక్కడకు పోతుంది? పెదాల్నుంచి అరుపు వెలువడక పోయినా దుఃఖం ఏమౌతుంది?

కానీ కొండయ్య కోపం అణిగి పోలేదు. తన కళ్ళముందే పెళ్లాన్ని ముక్కలు ముక్కలు చేస్తానని కావిడిపెట్టెలోంచి ఎరికెలకత్తి తీశాడు.

ఆ కత్తిచూసి వ్యాపారమ్మ చావుకేక పెట్టింది. అక్కడి మూక పరుగెత్తుకొచ్చారు. కొండయ్య క్రూరత్వాన్ని అరికట్టారు. వ్యాపారమ్మకు ఒక చావుగండం తప్పింది.

వ్యాపారమ్మకు తెలివి వొచ్చింది: అమృతంలో ఇమిడివున్న హాలాహలం, ఆనందం వెనుక పొంచిఉన్న 'నరకం, అనుభవ పూర్వకంగా తెలిసి వచ్చాయి.

భార్యమీద భర్తకున్న హక్కును ఎవ్వరూ తొలిగించ లేరు; అధికారాన్ని ఎవ్వరూ తగ్గించ లేరు; భార్య చేసిన తప్పటడుగుకు తగిన శిక్ష విధించే హక్కు భర్తకు ఉంది. భార్య అవినీతిని హింసాత్మకంగా అరికట్టే న్యాయం భర్తకు ఉంది.

కొండయ్య బుద్ధి మారింది. కాని యీ మారిన బుద్ధిలో ఎటువంటి రాక్షసత్వం ఉందో అతను తెలుసుకోలేదు. తనభార్యలో స్వతహాగా అవినీతికి పాల్పడే మనస్సులేదని అతను నమ్మటం జరిగింది. పుల్లయ్యే తన భార్యలో ఎట్లాగో అటువంటి మోహాన్ని రగిలించాడనీ, తన భార్య మంత్రించినట్టు ఆ మోహంలో పడిపోయిందనీ విశ్వసించాడు. తనని పాలెం కూలీలకోసం పంపడంలో గల కుట్ర అతనికి తేట తెల్లమైంది. కొండయ్య మీద తను పగ తీర్చుకోవాలి. ఎట్లా?

తన భార్యను పుల్లయ్య అనుభవించాడు. యీ సంగతి రేపు లోకానికి గర్వంగా చాటుతాడు. లోకం దృష్టిలో తను అసమర్థుడైన భర్త! తన సమర్థతను నిరూపించాలి. తన ప్రతీకారంతో పుల్లయ్య కుమిలి కుమిలి చావాలి. ఆయన తల ఎత్తుకోలేని పరాభవం చేయాలి. ఈ దెబ్బతో 'నీతి-అవినీతి' అంటే ఏమిటో తెలిసి రావాలి!

కొండయ్య భార్యను గొడ్డును బాదినట్టు బాదిన సంగతి ఆ మధ్యాహ్నమే పుల్లయ్యకు తెలిసింది. ఆ పైన ఎందుకు బాది వుంటాడనేది సులభంగా ఊహించ గలిగాడు. ఆ రోజు పుల్లయ్య ఇటుకరాయితీసే చాయలకే పోలేదు.

మరునాడు ఉదయం పుల్లయ్య ఆవడి దగ్గరకు వొచ్చాడు. అందరితో పాటు కొండయ్యా పనిచేస్తున్నాడు. వ్యాపారమ్మ మటుకు పనిలోకి రాలేదు. ఆమె ఇంకా పనిచేసే స్థితిలో లేదు. పుల్లయ్య కొండయ్యకేసి

ప్రత్యేకమైన పరిశీలనా దృష్టితో ఏమీ చూడలేదు గానీ, అప్పుడప్పుడు ఓకంట కనిపెడుతూనే ఉన్నాడు. అయినా ఆయనకు అతనిలో గమనించ తగ్గ మార్పులు ఏమీ గోచరించ లేదు.

ఆ సాయంత్రం పుల్లయ్య ఇటుకరాయి తీసేవాళ్ళ దగ్గిరకు రాలేదు. మేస్త్రీ కొండయ్య బత్తెపు ఖర్చులకుగాను డబ్బుకోసం పుల్లయ్య ఇంటికి వెళ్ళాడు. ఇంట్లో పుల్లయ్య లేడు. ఆ విషయం ఆయన భార్య చెప్పింది.

పుల్లయ్య భార్యను కొండయ్య చాశాడు. ఎందుకో ఆమెను చూడ గానే కొండయ్యలో ఒక రకమైన ఉత్సాహం ఉబికింది. ఖరీదైన చీరలో దాగిన ఆమె శరీరం, ఎత్తయిన రొమ్ముల పైన అందంగా ఉన్న నగలు, శిగలో విలాసంగా అమర్చబడ్డ పువ్వులు-నిలబడి, ఆమె వొంక ఏదో దాచిపెట్టిన వాడిలాగా - చూశాడు కొండయ్య. చూపులకే పుల్లయ్య భార్య భయపడింది. పేరుమోసిన బందిపోటుదొంగా లాగ ఉన్న అతని ఆకారాన్ని చూసి, ఆమె మంచంమీద కూర్చున్నదల్లా లేచి ఇంట్లోకి పరుగెత్తింది.

అంతలోకే పుల్లయ్య బజార్నుంచి వొచ్చాడు.

'ఏం కావాలి?'

'డబ్బుకోసం వొచ్చానండి!'

'మొన్న నేగదా రెండు వందలు తీసుకెళ్ళింది?'

'ముఖ్యేమంది మీద ఎన్ని రోజులు వొస్తాయండి? మేము గంజినీళ్లేం తాగడం లేదుగా!'

పుల్లయ్య ఇంట్లోకెళ్లి రెండు వందల రూపాయల నోట్లు తెచ్చి ఇచ్చాడు. పుల్లయ్యభార్య మరొకసారి బయటికొచ్చి తొంగి చూసింది. కొండయ్య బలవంతంగా నవ్వు తెప్పించుకొని ఆమెవొంక చూశాడు. పుల్లయ్య లెక్కరాసుకొనే ధ్యాసలో అదేమీ గమనించ లేదు. కొండయ్య డబ్బు తీసుకొని కాలువకట్టకేసి వెళ్ళాడు. అప్పటికి ఇంకా బాగా చీకటి పడలేదు.

★

ఆరోజు పుల్లయ్య ఇటుక ఆవ దగ్గరకు రాలేదు. ఎందుకు రాలేదని నల్లయ్యను అడగ్గా - పెళ్ళికి వెళ్ళాడని సమాధానం వొచ్చింది. ఆ సమాధానం విన్నదగ్గర్నుంచీ కొండయ్య చేతులు పనిచేయటం మానివేసినై. ఆలోచనలు బుర్రలో రంగుల రాట్నంగా తిరిగినై. అప్పటికి సాయంత్రమైంది. ఇంకో పావుగంటా, అరగంటలో ఎటుగూడీ పని ఆపుచేస్తారు. కొండయ్య ముందుగానే ఇవతలి కొచ్చాడు.

తను ఎదురు చూస్తోన్న రోజు వొచ్చింది. తను నాలుగు రోజులు నాల్గు క్షణాలుగా గుణించుకుంటున్నాడు. ఆముహూర్తం ఆసన్నమైంది. తను ప్రతీకారం తీర్చుకోవాలి! పుల్లయ్య ఎటువంటి అవినీతి పనిచేశాడో, ఎట్లా తన భార్యతో అనుభవాన్ని సంపాదించాడో, ఎట్లా నలుగురిలోనూ, తన పీరత్వానికి మీసం దువ్వుకున్నాడో—అట్లాగే అవినీతి పనిచేసి, అట్లాగే ఆయన భార్యతో అనుభవాన్ని సంపాదించి, అట్లాగే తనూ మీసం దువ్వాలి. అప్పుడు గానీ తన కడుపులో మండుతూన్న ప్రతీకారాగ్ని చల్లారదు; అప్పుడుగానీ పుల్లయ్య చేసిన అవినీతికీ, అన్యాయానికీ, తప్పుడు పనికీ—సరైన ప్రాయశ్చిత్తం జరగదు. చెడును చెడుతోనే ఎదిరించాలి. అవినీతే తగిన ప్రతీకారం!

ఈ విధమైన ఆలోచనలతో కొండయ్య బాగా చీకటిపడే వరకూ కాలవకట్టమీదే గడిపాడు. ఆ తరువాత ఇంటికొచ్చి అన్నం తిన్నాడు.

అందరూ గాఢనిద్రలో లీనమయ్యే వరకూ మేలుకొనే ఉన్నాడు కొండయ్య. ఆ పైన పడుకున్న చోటునుంచి లేచి-చీకట్లో ఊళ్ళోకి బయలు దేరాడు. వీధులన్నీ నిర్జనంగా చీకటి నీడల్లో నిద్రపోతున్నాయి. ఆ నాటి సాయంత్రంనుంచీ పుల్లయ్య భార్యనూ, తను పోతూన్న కర్తవ్యాన్నీ తలచుకొన్న కొద్దీ కొండయ్యలో అనిర్వచనీయమైన ఆనందం అధికమౌతూంది. పరస్త్రీని అనుభవించాలనే కాంక్ష కలగడం, ఆ కాంక్ష కలగడంలోని మానసికానందాన్ని పొందడం—ఇదే మొదలు!

పుల్లయ్య ఇంటి దగ్గరకు వెళ్ళాడు కొండయ్య. ఆ అర్ధరాత్రి అంత వరకూ అతన్ని చూసిన జీవం లేదు. అతనిలో ఉత్సాహమే కాని, ఏకోశానా భయం లేదు. ఆ చీకట్లో ఆ ఇంటి చుట్టూ ఒక్కసారి పరిశీలనా దృష్టితో ప్రదక్షిణ చేశాడు—లోపల జొరబడేందుకు ఎటు అవకాశం

ఉందోనని-వెనుక వైపుగా పెరట్లోకి ప్రవేశించటం సులభమైన మార్గంగా గోచరించింది. కొండయ్యలో ఒక ఆలోచనకూడా లేక పోలేదు. ఎండా కాలం కనుక చల్లగాలికి బయటనే పడుకొని వుండొచ్చు. ఆ ఆలోచన దొడ్డిత్రోవని జొరబడేందుకు అతనికి ఎక్కువ ప్రోత్సాహాన్ని యిచ్చింది. ఆరు అడుగుల ప్రహారీగోడ ఎక్కి కొండయ్య చప్పుడు గాకుండా లోపలి పక్కకు దిగాడు. బావి, అరటిచెట్లూ తప్పించుకొని—అతి నెమ్మదిగా ఇంటికి పడమటిపక్క ఖాళీస్థలంలోకి వొచ్చాడు కొండయ్య.

ఆ ఖాళీ స్థలంలోని దృశ్యం చూసేప్పటికి కొండయ్య కొయ్య బారాడు. ఆ ఖాళీ స్థలంలో అందమైన పెద్ద మంచం, ఆ అందమైన పెద్ద మంచంపైన మెత్తటి, తెల్లటి మల్లెపువ్వు లాంటి పక్క; ఆ మెత్తటి-తెల్లటి పక్కపైన ఇద్దరు...ఒక స్త్రీ, ఒక పురుషుడూ ..ఆ స్త్రీ ఎవరు? ఆ పురుషుడు ఎవరు? అతను పుల్లయ్యా, ఆమె అతని భార్యనా?

కాదు! పుల్లయ్య పెళ్ళికి వెళ్ళాడు. మరి ఎవరు? ఆమనిషి ఎవరైందీ కొండయ్య ఆ గుడ్డివెలుగులోనే గుర్తు పట్టగలిగాడు. ఎవరో కాదు-భాగస్థుడూ, పక్కఇంటి గృహస్థుడూ, మర్యాదస్థుడూ అయిన నల్లయ్యే!

ఏం మనుషులు? ఏం లోకం? నీతి ఎక్కడ? మర్యాద ఎక్కడ? మనుషుల ఆత్మల్లో ఎంత కల్మషం! పైకి ఎంత గౌరవంగా, మర్యాదగా, శీవిగా, రాజసంగా, ప్రవర్తిస్తారు? ఎంత స్నేహంగా, అన్యోన్యంగా, పవిత్రంగా ఉన్నట్టు అగపడతారు? అంతా నటనేనా? లోపల అంతా కపటమేనా? పరాయి స్త్రీలను అనుభవించాలనే దుర్బుద్ధితో, పాపపు టాలోచనలతో—సతమతమయ్యే పుల్లయ్య ఏం సమాధానం చెబుతాడు? తనవెనుక—తన ఇంట్లో జరిగే పాపం, అవినీతి ఎరుగడా? అక్కడికి తనే నిఖార్సయిన మగవాడైనట్టు—ఇతరుల భార్యలు తృప్తితీరక తనకోసం పడిచస్తారన్నట్టు. అంత అహంకారంగా ప్రవర్తిస్తాడేం? ఎట్లా ప్రవర్తిస్తే నేం? ఊళ్లో ఆయన గౌరవనీయుడు; పెద్దమనిషి; సంపాదనాపరుడు; ఊళ్లోని ధర్మాత్ముల్లో ఒకడు! ఇంట్లో ఎంత గూడుపుఠాణీ జరుగుతున్నా, ఎంత నీచపు పనులు జరుగుతున్నా బయటికి రాదు! ఇంకా పుల్లయ్య ఏ ముఖంతో 'ఫలానా స్త్రీని అనుభవించాను!' అని చెప్పుకుంటాడు? ఆయనలో చీమూ, నెత్తురూవుంటే, ఆయనలో నీతీ—అవినీతీ అనే

విచక్షణా జ్ఞానంవుంటే, ఆయనలో పరువూ—మర్యాదలపట్ల అభిమానం వుంటే, ఇంట్లో జరుగుతూన్న ఈ ఘోరాన్ని సహిస్తాడా?

కొండయ్య నిశ్చేష్టుడై గోడపక్కన నిలబడి ఆలోచిస్తున్నాడు. పవిత్రత, పాతివ్రత్యం-అనే పేర్లకింద గౌరవనీయులైన పెద్దల ఇళ్లల్లో జరిగే అవినీతి కరములైన పనులు అతని కళ్ళకు కట్టి నట్లయింది. ఇందులో ఎవరు గౌరవనీయులు కారు? ఎవరిది మర్యాదస్తుల కొంప కాదు? పుల్లయ్యా, నల్లయ్యా—ఇద్దరూ అన్యోన్యులైన స్నేహితులు, భాగస్థులు! లోకానికి ఇద్దరూ పెద్దమనుష్యులే! లోకం కళ్ళల్లో ఇద్దరూ నీతి, న్యాయాన్ని ఆరాధించేవాళ్లే! తములో తాము చేసుకొనే ద్రోహాల్ని గుర్తించుకున్నారా?

ప్రతీకారం విషయం ఆతను ఆలోచించటం లేదు. తన ప్రసక్తి లేకుండానే, కొగలపని గంధర్వులే తీర్చారన్నట్లుగా ప్రతీకారం జరిగి పోయింది. కాని...

'ఎవరా మనిషి? - దొంగ! దొంగ!' వెనుకనుంచి కేక వినపడ్డది.

కొండయ్యకు ఏం తోచలేదు. ఎటు పరుగెత్తటానికీ కాళ్ళు కదల లేదు.

'దొంగ...! దొంగ!' పుల్లయ్య తల్లి జామచెట్టు చాటునుంచి అరుస్తోంది!

ఇరుగూ - పొరుగూ ఇళ్ళ వాళ్ళు లేచారు! గోడదూకి పారిపోదా మంటే ఆ తొందరలో కొండయ్యకు కాళ్లు వొణికినై. గోడదగ్గరకు వెళ్లాడు ఎక్కటందుకు. ఇంతలో లాంతరు వెలుగు అతనిమీద పడింది. నల్లయ్య ఇంటిముందుగా తిరిగివొచ్చి-కొండయ్యను కావిలించుకున్నాడు. ఆయన్ని విదిలించుకో బోయేప్పటికి ఇంకా ఇద్దరు మనుష్యులు వొచ్చి పట్టు కున్నారు.

లాంతరు వెలుగులో నల్లయ్య, మేస్త్రీ కొండయ్యను గుర్తించాడు.

'తాళ్లు తీసుకు రాండిరా! జామ చెట్టుకు కట్టి పడేద్దాం!' అన్నాడు పొరుగింటి సుబ్బయ్య.

కొండయ్యకు మతిపోయింది. తనకు జరిగిన అపకారానికి, అపరా ధాన్ని ఇవ్వగల న్యాయం చిక్కలేదు; సరికదా, తను అన్యాయమై

పోయ్యాడు...తన జీవితం ధ్వంసం. తను జైల్లో పడితే, ఆ పుల్లయ్యగారు తన భార్యతో కులుకుతూంటాడు కాబోలు. అవినీతిని అరికట్ట బోయి, దాన్ని ద్విగుణీకృతం చేశాడు...

అన్యాయాలూ, అక్రమాలూ అవినీతి కార్యాలూ చేస్తున్న పుల్లయ్యా, నల్లయ్యలు న్యాయశీలురవలెనే, మర్యాదస్తుల్లాగే చలామణీ అవుతున్నారు; కాని, అక్రమాన్ని అరికట్టలేని అశక్తుడై, ప్రతీకారం తీసుకునే అవకాశంకూడా లేక, చివరకు తను దొంగ అవుతున్నాడు. యీ కథంతా ఎవరికొ్కవాలి? ఏది న్యాయం? ఏది అన్యాయం? ప్రపంచం దీన్ని నిర్ణయించటంలో ఎంత గొప్ప పొరపాటు పడుతోంది! ఆ పొరపాటు ఫలితాన్ని తాను అనుభవించాల్సిందేనా?...యీ ఊహల్తో అతని బుర్ర తిరిగిపోయింది. కేవలం కీలుబొమ్మల్లే ఐపోయి, తాళ్లు వొరుసుకుంటున్నా తెలియని మైకంలో పడిపొయ్యాడు, కొండయ్య.

